# సాహసమైనా ప్రయోజనకరమే..



విశ్వంభర, సినిమా: ప్రస్తుతం ఓటీటీలు సినిమా నిర్మాతలకు ఓ ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. విడుదలకు ముందే సినిమాని ఓటీటీకి అమ్మితే మంచి లాభాలొస్తాయి. విడుదలకు ముందే సేఫ్ అయిపోవచ్చు. కానీ, ఆమిర్ ఈ ఓటీటీ మార్కెట్‌ను కాదనుకుని సాహసానికి సిద్ధమయ్యారు. తన సినిమాని థియేట్రికల్ రిలీజ్ తర్వాత పే పర్ వ్యూ పద్ధతిలో యూట్యూబ్‌లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. నిజానికి ఇందులో కొన్ని సవాళ్లున్నప్పటికీ ప్రేక్షకుల్ని థియేటర్ల బాట పట్టించడానికి.. సినిమాని ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మందికి చేరువ చేయడానికి.. దీర్ఘకాలిక ఆదాయం పొందడానికి అవకాశం కల్పిస్తోంది. ప్రస్తుతం ఎంతటి హిట్ చిత్రాలైనా సాధారణంగా 810 వారాల తర్వాత ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. దాని వల్ల 'ఓటీటీలోనే చూసుకుందాం లే' అనుకుని థియేటర్లకు దూరం జరుగుతున్న ప్రేక్షకుల సంఖ్య అంతకంతకూ రెట్టింపవుతోంది. కానీ, ఈ యూట్యూబ్ టీవీఓడీ మోడల్ సినీప్రియుల్ని థియేటర్లకు ఆకర్షించేలా చేస్తుంది. ఎందుకంటే ఓ మంచి సినిమా ఓటీటీలోకి రావట్లేదని తెలిస్తే.. దాన్ని డబ్బులు పెట్టి యూట్యూబ్‌లో చూసే బదులు నేరుగా థియేటర్‌లో చూడాలన్న ఆసక్తి ప్రేక్షకుల్లో కలుగుతుంది. అదే జరిగి వాళ్లు సినిమా హాళ్లకు వెళ్లడం అలవాటు పడితే థియేటర్ వ్యవస్థ మళ్లీ తిరిగి గాడిన పడుతుంది. ఇది ఆమిర్ నిర్ణయం వెనకున్న ఓ లాజిక్ అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. అలాగే పేపర్ వ్యూ అన్నది నిర్మాతలకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా నిలుస్తుంది. ఓటీటీ వేదికల మాదిరిగా ఇక్కడ ఆదాయం నిర్దిష్ట మొత్తానికి పరిమితమైపోదు. నిజానికి అన్ని ఓటీటీలు అందరికీ అందుబాటులో లేకపోవచ్చు. కానీ, యూట్యూబ్ అలా కాదు. ప్రపంచవ్యాప్తంగా సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటుంది. కాబట్టి సినిమా బాగుందన్న టాక్ వస్తే.. 8వారాల తర్వాత ఎవరైనా నిర్ణీత మొత్తం చెల్లించి యూట్యూబ్‌లో చూసుకునే అవకాశం దొరకుతుంది. కాబట్టి ఇదిలా వీక్షణల ఆధారంగా దీర్ఘకాలం పాటు నిర్మాతలకు ఆదాయాన్ని అందిస్తూనే ఉంటుంది. అలాగే ఈ మోడల్‌లో నిర్మాతలకు.. యూట్యూబ్‌కు మధ్య మధ్యవర్తులంటూ ఎవరూ ఉండరు. వీక్షణల ఆధారంగా లభించే డబ్బంతా కొంత కమిషన్లు పోనూ నేరుగా నిర్మాతల చేతుల్లోకే వెళ్తుంది.

**టీవీఓడీ మోడల్‌లోని సవాళ్లేంటి?**

ఈ విధానంలో నిర్మాతలకు సినిమా విడుదలకు ముందే నిర్ణీత ఆదాయం అంటూ ఏమీ రాదు. ఈ పద్ధతిలో సినిమా విజయవంతమైతే నిర్మాతలకు ఎక్కువ ఆదాయం లభిస్తుంది.. లేదంటే నష్టపోవాల్సి వస్తుంది. అదే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లతో ఒప్పందం కుదుర్చుకుంటే సినిమా పనితీరుతో సంబంధం లేకుండా ముందుగానే ఒక నిర్దిష్ట మొత్తం లభిస్తుంది. అలాగే పైరసీ అన్నది మరో పెద్ద సవాల్. ప్రస్తుతం ఓటీటీ వేదికల్లోనూ పైరసీ సమస్య ఉన్నప్పటికీ.. టీవీఓడీలో దాని ప్రభావం మరింత ఎక్కువ. అలాగే ఈ మోడల్‌కు విస్తృత ఆదరణ దక్కాలంటే ముందుగా ప్రేక్షకుల వీక్షణ ధోరణిలో మార్పు రావాలి. ప్రస్తుతం భారతీయ ప్రేక్షకులు సాధారణంగా ఉచిత కంటెంట్ లేదంటే సబ్‌స్క్రిప్షన్ ఆధారిత కంటెంట్‌కు అలవాటు పడ్డారు. ఒక్కో సినిమాకి నిర్ణీత మొత్తం చెల్లించేలా వాళ్లను ఒప్పించాలంటే.. ఆకర్షణీయమైన కంటెంట్.. బలమైన బ్రాండ్ ఆకర్షణ అవసరం.

**ఫలిస్తే ఆధిపత్యానికి అడ్డుకట్ట పడినట్లేనా!**

ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్‌ఫామ్‌లు సినిమా పంపిణీ విధానాన్ని సమూలంగా మార్చివేశాయి. మొదట్లో ఈ ఓటీటీ మార్కెట్ నిర్మాతల పాలిట కల్పవృక్షంలా కనిపించినా.. ఇప్పుడా ఓటీటీల ఆధిపత్యంలో చిక్కుకున్నాక వాటి వల్ల సినిమాలకు, థియేటర్ వ్యవస్థకు జరుగుతున్న నష్టమేంటన్నది మెల్లగా అర్థమైంది. ఈ పరిణామాలపై ఆమిర్ ఎన్నో వేదికలపై తన గళం వినిపించారు. ఓటీటీల ఆధిపత్య ధోరణికి చెక్ పెట్టాల్సిందేనని చెబుతూ వచ్చారు. ఈ క్రమంలోనే ఇప్పుడీ ప్రయోగానికి సిద్ధపడ్డారు. మరి ఇది ఏమేర ఫలిస్తుందో చూడాలి. ఒకవేళ ఈ విధానం క్లిక్ అయ్యి ఓటీటీల రూపంలో వచ్చే ఆదాయం యూట్యూబ్‌లోనే వస్తుందంటే.. అన్ని చిత్రసీమలూ ఇదే పంథాను అనుసరించే అవకాశముంది. అదే జరిగితే ఓటీటీ ఆధిపత్యానికి చెక్ పడినట్లే.

"ఓటీటీ ఇప్పుడొక మాఫియాగా మారిపోయింది. సినిమాల్ని.. వాటి నిర్మాణాల్ని దాదాపు తమ నియంత్రణలోకి తీసుకున్నాయి. ఇలాంటి తరుణంలో ఆమిర్ ఖాన్ తాను నిర్మించిన 'సితారే జమీన్ పర్'ను ఓటీటీకి ఇవ్వకుండా నేరుగా యూట్యూబ్‌లో పే పర్ వ్యూ పద్ధతిలో విడుదల చేయనుండటం స్వాగతించదగ్గ పరిణామమే. ఈ ప్రయోగం ఎలాంటి ఫలితాన్నిస్తుందో మేమూ ఆసక్తిగా గమనిస్తున్నాం. ఇప్పుడు ఆమిర్ చేస్తున్న ప్రయోగం పెద్ద నిర్మాతలకు సవాల్‌తో కూడుకున్న వ్యవహారమే అయినా.. చిన్న సినిమాలు తీసే వాళ్లకి తప్పకుండా ఓ ధైర్యాన్నిస్తుంది".

చైతన్య రెడ్డి, నిర్మాత (ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్)

"'సితారే జమీన్ పర్' లాంటి పెద్ద సినిమాని ఆమిర్ ఖాన్ యూట్యూబ్‌లో పే పర్ వ్యూ పద్ధతిలో విడుదల చేయనుండటం ఆసక్తిరేకెత్తించే విషయమే. ఇదెలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి. ప్రస్తుతం సంవత్సరానికి ఇంతని సబ్‌స్క్రిప్షన్ వసూలు చేస్తున్న ఓటీటీ సంస్థలు కూడా రాబోయే రెండు మూడేళ్లలో ఈ పే పర్ వ్యూ పద్ధతిని అనుసరించే అవకాశం లేకపోలేదు. ఎవరైనా ఆయా ఓటీటీ లైబ్రరీల్లోని పాత సినిమాలు చూడాలంటే తప్పకుండా నిర్ణీత మొత్తం చెల్లించాల్సి రావొచ్చు. కాబట్టి ఇలాంటి పద్ధతిని వాళ్లు అలవాటు చేసే లోపు ఆమిర్ అందిపుచ్చుకోవడం స్వాగతించాల్సిందే".

రాహుల్ యాదవ్ నక్కా, నిర్మాత (స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్)



## ఫస్ట్ టైం.. అలాంటి ప్రయోగం చేయబోతున్న రష్మిక

అనుకోకుండా హీరోయిన్‌గా మారిన రష్మిక మందన్నా నేషనల్ క్రష్ అయిపోయింది. పాన్ ఇండియా హీరోయిన్‌గా కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకుంది. వరుస బ్లాక్ బస్టర్స్ సొంతం చేసుకుంటూ నంబర్ వన్ కథానాయకురాలిగా దూసుకుపోతుంది. ప్రస్తుతం భారీ ప్రాజెక్ట్స్ కమిట్ అయిన ఈ బ్యూటీ.. ఫస్ట్ టైం స్పెషల్ సాంగ్‌లో కనిపించబోతుంది. మాస్ మసాలా సాంగ్‌తో మెస్మరైజ్ చేయబోతుంది. హై ఎనర్జీ స్పెషల్ డ్యాన్స్ నంబర్‌తో అభిమానులను ఉర్రూతలూగించనుంది. కాగా ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం.

యంగ్ టైగర్ ఎన్టీఆర్, ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న డ్రాగన్ మూవీలో రష్మిక స్పెషల్ సాంగ్ చేయనుందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఆమెను డైరెక్టర్ అప్రోచ్ కాగా ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసినట్లు ఇండస్ట్రీ టాక్. వైబ్రెంట్ స్క్రీన్ ప్రజెన్స్, మాసివ్ ఫ్యాన్ బేస్ కలిగిన రష్మిక ఈ సాంగ్‌తో ఫ్రెష్ ఫీల్ తీసుకొస్తుందనే ఉద్దేశంతో మేకర్స్ ఈ డెసిషన్ తీసుకున్నారని తెలుస్తోంది. అయితే కొందరు విశ్లేషకులు మాత్రం ఇది ఐటెమ్ సాంగ్ కాదని సినిమాను హై ఎమోషన్‌లో మలుపు తిప్పే పాట అని, రవి బస్రూర్ ట్రెమండస్ మ్యూజిక్ ఇవ్వబోతున్నట్లు చెప్తున్నారు. ఇక దీనిపై స్పందిస్తున్న నందమూరి అభిమానులు ఎన్ని ఎక్స్‌పెక్టేషన్స్ అయినా పెట్టుకోండి రీచ్ అవుతామని కామెంట్స్ చేస్తున్నారు.



## అమ్మాయిలకు ఓ నమ్మకాన్నిచ్చే దేవిక అండ్ డానీ

విశ్వంభర, సినిమా: "చాలా మంది అమ్మాయిలను చుట్టు పక్కల ఉండేవాళ్లు 'నువ్వు చేయలేవు.. సాధించలేవ'ని చెప్పి నిరుత్సాహపరుస్తుంటారు. అలాంటి అమ్మాయిలకు ఈ 'దేవిక అండ్ డానీ' వెబ్‌సిరీస్ ఓ నమ్మకాన్ని ఇస్తుంది" అన్నారు నటి రీతూ వర్మ. ఇది ఆమె నటించిన తొలి వెబ్‌సిరీస్. 'శ్రీకారం' విజయంతో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన బి.కిశోర్ దీన్ని రూపొందించారు. సుధాకర్ చాగంటి నిర్మాత. సూర్య వశిష్ఠ, శివ కందుకూరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ వెబ్‌సిరీస్ ఈ నెల 6న ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీతూ వర్మ మాట్లాడుతూ.. "వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌లు వస్తే వెబ్‌సిరీస్ చేయాలని నేనెప్పటి నుంచో అనుకుంటున్నా. ఈ క్రమంలోనే 'దేవిక అండ్ డానీ' లాంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకొచ్చింది. ఇందులో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నా. దర్శకుడు కిశోర్ దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు" అంది. "సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిల్ని.. 'ఈ పని చేయి, ఆ పని చేయక'ని ఆంక్షలు పెడుతుంటారు. అలాంటి వాళ్లు బయటకు వెళ్తే ఎలా మారతారనే విషయాన్ని ఈ సిరీస్‌లో చక్కగా చూపించార"న్నారు నటుడు సూర్య వశిష్ఠ. దర్శకుడు బి.కిశోర్ మాట్లాడుతూ.. "'శ్రీకారం' తర్వాత ఈ సిరీస్ చేయడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చూసే ప్రేక్షకుల సమయం అసలు వృథా కాదు. ఇది ఆద్యంతం ప్రేక్షకుల్ని అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో శివ కందుకూరి, సుధాకర్, మౌనిక, నందిని, జై క్రిష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ ఓదెల మూవీలో విలన్ గా కలెక్షన్ కింగ్

విశ్వంభర, సినిమా: తెలుగు సినిమా రంగంలో దర్శకుడిగా విశేషమైన గుర్తింపు పొందిన శ్రీకాంత్ ఓదెల, తన తాజా ప్రాజెక్టులతో మరోసారి సంచలనం సృష్టిస్తున్నాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న రెండు సినిమాల్లోని ఒక సినిమాలో కలెక్షన కింగ్ మోహన్ బాబు విలన్ గా నటించనున్నట్లు సమాచారం. ఇందుకాయన ఓకే చెప్పినట్లు కూడా తెలుస్తోంది. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల నానితో ది ప్యారడైజ్ మూవీ చేస్తున్నాడు. వీరిద్దరి కాంబోలో వస్తోన్న రెండో సినిమా ఇది. తొలి సినిమా దసరా.. బాక్సాఫీస్ వద్ద రూ.135 కోట్ల వసూళ్లు చేసి బ్లాక్ బస్టర్ గా నిలిచింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైస్' ఒక యాక్షన్‌ప్యాక్డ్ డ్రామా, ఇది గోదావరిఖని సమీపంలోని సింగరేణి బొగ్గు గనుల నేపథ్యంలో రూపొందింది. ఈ చిత్రంలో నాని ప్రధాన పాత్రలో నటిస్తుండగా, విలన్ క్యారెక్టర్ ఇంకా కన్ఫర్మ్ కాలేదు. ఈ సినిమాను శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. నాని స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. 'ది ప్యారడైస్' రూ. 70 కోట్ల బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. 2024లో షూటింగ్ ప్రారంభమవ్వగా.. 2025 చివరిలో లేదా 2026 ప్రారంభంలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులో ఉంటుంది. దీని తర్వాత చిరంజీవితో శ్రీకాంత్ ఓదెల 157వ సినిమాను తీయనున్నారు. ఈరెండింటిలో ఒక సినిమాలో మాత్రం మోహన్ బాబు విలన్ గా కనిపించనున్నట్లు టాక్. ఇదెంతవరకూ నిజమో, ఏ సినిమాలో ఆయన విలన్ గా కనిపిస్తాడో తెలియాలంటే మూవీ టీమ్ స్పందించేంత వరకూ వెయిట్ చేయాల్సిందే.






## రానా నాయుడి కుటుంబాన్ని ఎవరూ విడదీయలేరు!

విశ్వంభర, సినిమా: "ప్రపంచంలో రానా నాయుణ్ని ఢీకొట్టగల ఒకే వ్యక్తి అతని తండ్రి మాత్రమే" అంటున్నారు అగ్ర కథానాయకుడు వెంకటేశ్. ప్రస్తుతం ఆయన, కథానాయకుడు రానా ప్రధాన పాత్రల్లో నటించిన సిరీస్ 'రానా నాయుడు సీజన్ 2'. గతంలో విడుదలై యువతను విశేషంగా ఆకట్టుకున్న 'రానా నాయుడు' సిరీస్‌కు సీక్వెల్‌గా రూపొందింది. యాక్షన్, క్రైమ్ డ్రామా నేపథ్యంలో కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ వర్మ రూపొందించారు. సుందర్ ఆరోన్ నిర్మించారు. తాజాగా ఈ సిరీస్ ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది సిరీస్‌బృందం. "తనను ఎవరు సృష్టించారో ఎప్పటికీ మర్చిపోనివాడే నిజమైన వ్యక్తి, నా కుటుంబమే నాకు సర్వస్వం.. ఒబెరాయ్‌స్ గతాన్ని వెతికే ప్రక్రియలో నాయుడు భవిష్యత్తు మొత్తం బూడిదపాలయ్యే అవకాశం ఉంది, నువ్వు నాతో ఎప్పుడూ అంటుంటావు.. నేను ఈ కుటుంబాన్ని విడదీశానని.. కానీ బయట ఏమనుకుంటున్నారో తెలుసా? రానా నాయుడి కుటుంబాన్ని ఎవరూ విడదీయలేరని.." లాంటి సంభాషణలతో సాగుతున్న ఈ ట్రైలర్ ఈసారి సినీ ప్రియులకు రెట్టింపు వినోదాన్ని పంచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బంద, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 13నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఈ సిరీస్ తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రసారం కానుంది.

వైశ్య వికాస వేదిక
Values Vision Victory
10వ తరగతి, ఇంటర్మీడియట్ వైశ్య విద్యార్థినీ విద్యార్థులకు
ప్రతిభ పురస్కారాలు – 2025
10th & Intermediate Students
PRATIBHA PURASKAR - 2025
Date: 08-06-2025, Sunday
at 08.30 am Onwards
-: Venue :-
VRC CONVENTION & BANQUETS
ORR , Exit 11, Pedda Amberpet, Hyderabad
Registration Timings: 08.30 am to 11.00 am
"Candidates who enroll your name at Venue get a chance to Win a LAPTOPS by Lucky Draw"
Lunch: 1.30 pm Onwards
*Note: 'NO NEW ENTRIES at Program Location'
SCAN HERE FOR LOCATION
డా॥ కాచం సత్యనారాయణ గుప్త
M.A,MSW,PGDCJ,LLB
ఫౌండర్ చైర్మన్ - వైశ్య వికాస వేదిక
Cell: 9441222429



## డిసెంబరు 5న రాజాసాబ్



విశ్వంభర, సినిమా: ఎప్పుడెప్పుడా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'ది రాజాసాబ్' ఒకటి. ప్రభాస్ కథానాయకుడిగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఎట్టకేలకి విడుదల తేదీని ఖరారు చేసుకుంది. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. టీజర్‌ని ఈ నెల 16న విడుదల చేయనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రమిది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ నటిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. మంగళవారం ప్రత్యేకమైన ఓ పోస్టర్‌తోపాటు, సినిమా, టీజర్ విడుదల వివరాల్ని ప్రకటించింది నిర్మాణ సంస్థ. "భారీ హంగులతో రూపొందుతున్న చిత్రమిది. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ గొప్ప అనుభూతిని పంచుతుంద"ని సినీవర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: కార్తీక్ పళని, సంగీతం: తమన్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ప్రొడక్షన్ డిజైన్: రాజీవన్.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS "విశ్వంభర" తెలుగు దిన పత్రిక VISHVAMBHARA TV
ప్రముఖ టీవీ ఛానల్స్, తెలుగు దినపత్రికల్లో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా
రిపోర్టర్లు, కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, కెమెరామెన్స్,
PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్
పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060, తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com